



పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, తదితరులు

సభ సక్సెస్‌పై.. కాంగ్రెస్ ఫోకస్

- నేడు సభ నిర్వహణ కోసం కమిటీలను ఏర్పాటు చేయనున్న పీసీసీ నేతలు
- మూడు రోజుల పాటు కామారెడ్డిలోనే రాష్ట్ర ఇన్‌చార్జి మకాం
- 13న కామారెడ్డికి మీనాక్షి నటరాజన్
- సభ ఏర్పాట్లను పరిశీలించే అవకాశం
- వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటన

కామారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈ నెల 15న బీసీ రిజర్వేషన్ల అమలు విజయోత్సవ సభ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించనున్న నేపథ్యంలో ఈ సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ఫోకస్ పెట్టింది. సభ నిర్వహణకై ఆదివారం కామారెడ్డిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఐదుగురు మంత్రులతో ముఖ్యనేతల, కార్యకర్తల సన్నాక సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్లో సభ ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్‌లు, పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉమ్మడి జిల్లాల ఇన్చార్జులు, అనుబంధ సంఘాల ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. సభ నిర్వహణకై ఆయా నేతలతో చర్చించారు. సభ విజయవంతం చేసేందుకు, రాష్ట్ర వ్యాప్తంగా జన సమీకరణ చేసేందుకు, వేదిక ఏర్పాటులకు,సభ మేనేజ్మెంట్‌కు, తదితర వాటిపై మంగళవారం ప్రత్యేక కమిటీలు వేయనున్నట్లు తెలిసింది.

3 రోజుల పాటు కామారెడ్డిలోనే మీనాక్షి నటరాజన్

కామారెడ్డిలో నిర్వహించే బీసీ రిజర్వేషన్ విజయోత్సవ సభను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ సభను

మరిన్ని వివరాలు 8వ పేజీలో...

జిల్లాలో.. అభివృద్ధి పనుల పేరిట ఇసుక కోసం కాంట్రాక్టర్‌లు రెవెన్యూ శాఖ ద్వారా ఒకచోట అనుమతులు తీసుకుంటూ.. మరో చోట తవ్వకాలు జరుపుతూ ఇసుక అక్రమ దందాకు తెరలేపారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉచిత ఇసుకను ఇస్తుండడంతో.. ఆ ఇసుక పక్కదారి పడుతుంది. తాజాగా నాగమడుగు ఎత్తిపోతల నీటి ప్రాజెక్ట్ పేరిట పెద్దమొత్తంలో ఇసుక అక్రమ దందా కొనసాగుతుంది.



శెట్లూర్ మంజీరలో ట్రాక్టర్‌కు ఎలాంటి ఫ్లెక్సీ పెట్టకుండా కూలీలతో ఇసుకలోడ్ చేపిస్తున్న దృశ్యం

దర్జాగా.. దందా



అనుమతులు ఒక చోట.. తవ్వకాలు మరోచోట!!

కామారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగమడుగు ఎత్తిపోతల నీటి ప్రాజెక్ట్ పని నిమిత్తం ఇసుక కోసం మంజీరలో అనుమతులు తీసుకుంటూ వేరేచోట తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఓ మంత్రి పేరు చెప్పి కాంట్రాక్టర్ ఇసుకను పక్కదారి పట్టిస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ కర్ణాటకకు చెందిన వాడు కావడంతో మంజీరలో ఇసుక తవ్వకాలు జరుపుతూ ప్రాజెక్ట్ పనులకు తరలించకుండా గుట్టుగా కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న ట్లు తెలిసింది. అది కూడా వారి టిప్పర్‌లలో ఓవర్‌లోడ్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాడు. అయితే అక్రమ ఇసుక దందాకు కొందరు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలోని మంజీరలో ఇసుక నిల్వలు చాలానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో టీజీఎండీసీ ద్వారా ఇసుక క్వారీల నిర్వహణ నిర్వహించి కాంట్రాక్టర్‌లకు అనుమతులు ఇవ్వడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకురేది. అయితే గత ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలలో భారీగా అవినీతి జరిగిందని వచ్చిన ఫిర్యాదుల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం క్వారీలను రద్దు చేసింది. కేవలం ఇందిరమ్మ ఇళ్లుప్రభుత్వ పనులకు మాత్రమే రెవెన్యూ ద్వారా ఇసుకకు అనుమతులు ఇస్తున్నారు. ఇటీవల వరదలతో మంజీరలో భారీగా ఇసుక మేటలు వేశాయి. అయితే కర్ణాటకకు చెందిన ఓ కాంట్రాక్టర్ నీటి ప్రాజెక్ట్ పేరిట పదుల సంఖ్యలో భారీ ఇసుక టిప్పర్‌లను ఓవర్ లోడ్‌తో జిల్లా సరిహద్దులను దాటిస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ రూ.లక్షల్లోనే ఇసుక దందా చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుంది.

భారీగా ఇసుక మేటలు

జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాలైన మెదక్, సంగారెడ్డి ప్రాంతాలలో భారీగా వర్షాలు కురువడంతో మంజీరలో వరద పోటెత్తింది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద రావడం తో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో మంజీర వరద ఉధృతితో ప్రవహించింది. అయితే గత వారం రోజులుగా వరద తగ్గుముఖం పట్టడంతో మంజీరలో భారీగా ఇసుక మెటలు వెలిశాయి. బిచ్కుంద, మద్నూర్, బీర్కూర్, బాన్సువాడలో మంజీర నది ప్రవహిస్తుంది. అయితే వరద తగ్గుముఖం పట్టడంతో బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, మద్నూర్ మంజీరలో భారీగానే ఇసుక నిల్వలు బయటపడ్డాయి. అంతేకాకుండా మంజీర నదిలోని ఇసుకపై కాంట్రాక్టర్‌ల కన్నుపడింది. దీంతో అక్రమ ఇసుక రవాణాకు అక్రమార్కులు తెరలేపారు.

- జిల్లాలో నాగమడుగు నీటి ప్రాజెక్ట్ పేరిట ఇసుక అక్రమ రవాణా
- ప్రాజెక్ట్ పనుల కోసం పుల్కల్ మంజీరలో ఇసుకకు అనుమతులు
- 200 ఇసుక ట్రాక్టర్‌లకు ప్రొసీడింగ్
- కానీ శెట్లూర్ మంజీరలో తవ్వకాలు
- ట్రాక్టర్‌ల ద్వారా ఓ ప్రాంతంలో ఇసుక డంప్‌లు
- డంప్ నుంచి భారీ టిప్పర్‌లలో ఓవర్ లోడ్‌తో కర్ణాటకకు అక్రమ రవాణా
- ఇసుక దందాకు తెరలేపిన కర్ణాటక కాంట్రాక్టర్
- ఓ మంత్రి పేరుచెప్పి ఇసుక పక్కదారి
- వత్తాసు పలుకుతున్న కొందరు అధికారులు

పుల్కల్‌లో ఇసుకకు అనుమతులు

నిజాంసాగర్ మండలం వడ్డెపల్లి వద్ద మంజీరపై నాగమడుగు ఎత్తిపోతల నీటి ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ పనుల కోసం ఇసుక కోసం కర్ణాటకకు చెందిన ఓ కాంట్రాక్టర్ రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పనుల నిమిత్తమై రెవెన్యూ విచారణ జరిపి ప్రాజెక్ట్ పనుల కోసం ఇసుకకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. నాలుగు రోజుల క్రితం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బిచ్కుంద మండలం పుల్కల్ మంజీరలో 200 ట్రాక్టర్‌ల ఇసుక తవ్వకాల కోసం ప్రొసీడింగ్ జారీ చేశారు. పుల్కల్ నుంచి రెవెన్యూ అధికారులు ఏరోజైతే అనుమతి ఇస్తారో.. ఆ రోజు మాత్రమే ఇసుకను కాంట్రాక్టర్‌లు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే కొందరు కాంట్రాక్టర్‌లు అనుమతి పేరిట వేరేచోట తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

శెట్లూర్ మంజీరలో తవ్వకాలు

నాగమడుగు ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల కోసం రెవెన్యూ అధికారులు బిచ్కుంద మండలం పుల్కల్ మంజీరలో

(తరువాయి 8వ పేజీలో....)

పుల్కల్‌లో మాత్రమే అనుమతులు ఉన్నాయి

: కిరణ్మయి, సబ్ కలెక్టర్, బాన్సువాడ



నాగమడుగు ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల కోసం పుల్కల్ మంజీరలో 200 ఇసుక ట్రాక్టర్‌లకు ప్రొసీడింగ్‌లు ఇచ్చాం. ఇసుక ట్రాక్టర్‌లకు ప్రభుత్వ పనులకోసం ఫ్లెక్సీలు పెట్టి ప్రొసీడింగ్‌లు, వే బిల్లులు చూపించి ఇసుక తీసుకెళ్లాలి. ఇసుక తవ్వకాల వద్ద రెవెన్యూ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాం. పుల్కల్‌లో కాకుండా షెట్లూర్‌లో తవ్వకాలు జరుపుతున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారణచేపడుతాం.

ఎన్నికల ప్రక్రియలో అందరూ సహకరించాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- కలెక్టరేట్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండల, గ్రామ పంచాయతీలలో ముసాయిదా ఓటర్ జాబితాను, పోలింగ్ స్టేషన్లను ప్రచురించామని, ఎన్నికల ప్రక్రియలో అందరూ సహకరించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదాలపై అభ్యంతరాలు,సలహాలు, సూచనలు మంగళవారం పరిశీలించి బుధవారం తర్వాత తుది ఓటర్ జాబితాను, పోలింగ్ స్టేషన్ల జాబితాను కార్యాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల ప్రక్రియలో సహకరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ బ్రోచర్ ఆవిష్కరణ

విద్యార్థి విజ్ఞాన్ మంతన్ బ్రోచర్‌ను సోమవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. విద్యార్థులలో దాగిఉన్న శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణ వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. కేంద్రప్రభుత్వం సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిభ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్‌సీఎస్‌ఎమ్, విజ్ఞాన భారతీ సంయుక్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విజ్ఞాన్ మంతన్ జిల్లాకోఆర్డినేటర్ ప్రవీణ్, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

కామారెడ్డి టౌన్: ప్రజావాణిలో ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 73 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో

తరువాయి 8వ పేజీలో....



ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్సీ, కలెక్టర్‌లు

సన్మార్గ జీవితానికి గురువువే పునాది

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌లు
- కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానం

మరిన్ని వివరాలు 8వ పేజీలో...

యూరియా... ఏదయా!

- సింగిల్ విండో కార్యాలయం ముట్టడించిన రైతులు
- ఉప్పల్వాయి బీటీ రోడ్డుపై గంట పాటు రాస్తారోకో

రామారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడే విధంగా యూరియాను అమ్మకపోవడం రామారెడ్డి రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో, ఉప్పల్వాయి సింగిల్ విండో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూ లైన్ ద్వారా యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగానే ఒక్కొక్కరికి ఒక్కో యూరియా సంచి ఇవ్వకపోవడంతో ఎక్కువ స్థాయిలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్వాయి గ్రామంలో సదాశివనగర్ - రామారెడ్డి బీటీ రోడ్డు పైన గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, పోసానిపేట్, ఉప్పల్వాయి, గిద్ద, మోషంపూర్, రంగంపేట, గొల్లపల్లి, ఇసన్నపల్లి, కన్నాపూర్, గోకుల్ తండా తదితర గ్రామాల, తండాల నుంచి పెద్ద ఎత్తున రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యూరియా సంచులు అందుబాటులో ఉండకపోవడంతో రైతు వెనుదిరిగి బయలుదేరారు. రాస్తారోకోతో రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు మధ్య రాస్తారోకో విరమించారు. యూరియా సంచులు అధికంగా వస్తే రామారెడ్డి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రైతులకు యూరియా సంచులను పంపిణీ చేస్తామని అధికారులు వివరించారు.





ఉప్పల్‌వాయి సింగిల్ విండో కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు (ఇన్‌సెట్‌లో యూరియా కోసం బారులు తీరిన వైనం)

యూరియా కొరతను వెంటనే పరిష్కరించాలి

సదాశివనగర్: రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా కొరత వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు రైతు సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని, పంటలను నాశనం చేస్తున్న అడవిపందులు, కోతుల బారి నుంచి పంటలను కాపాడే విధంగా అటవీ అధికారులతో చర్చించి పరిష్కరించాలన్నారు. సన్నరకం వడ్లకు రూ.5వేల బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. సోయా, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏనుగు లక్ష్మారెడ్డి, మండల కార్యవర్గసభ్యులు వివిధ గ్రామాల అధ్యక్షులు రైతులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

పంటలను కాపాడుకోవడానికి తంటాలు



పంటకు సాగునీరు పెట్టడం కోసం జనరేటర్‌ను బిగించిన రైతు

- వరదల్లో కొట్టుకుపోయిన విద్యుత్ పోల్స్, నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు
- అడవిలింగాల శివారులో విద్యుత్ సరఫరా లేక జనరేటర్ బిగించిన రైతు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో మండలంలోని తిమ్మాపూర్, అడవిలింగాల, గ్రామాల చెరువు కట్టలు తెగి కళ్యాణి వాగులోకి నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పాటు కళ్యాణి ప్రాజెక్టు గేట్లు అధికారులు సమయానికి ఎత్తకపోవడం వల్ల అడవిలింగాల, లింగారెడ్డిపేట్, కళ్యాణి, తిమ్మారెడ్డి, అజామాబాద్, అన్నాసాగర్ గ్రామాలకు చెందిన వాగు సమీపంలో ఉన్న పంట పొలాల్లో నుంచి నీరు ప్రవహించడంతో పాటు ఇసుక మేటలు, రాళ్లు పెట్టాయి. అంతేకాకుండా భారీ వరదకు విద్యుత్ స్తంభాలు కొట్టుకపోయాయి. దిమ్మెలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. వరద తగ్గి పది రోజులు అవుతున్నా.. రైతులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. అటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా చేయాలని రైతులు విద్యుత్ అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా.. స్పందించడం లేదని అడవిలింగాల గ్రామ శివారులో ఓ రైతు జనరేటర్‌ను అద్దెకు తీసుకువచ్చి తన వరి పంటను కాపాడుకోవాలని నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన కానీ విద్యుత్ అధికారులు, ఎలాంటి విద్యుత్ మరమ్మతులు చేపట్టకుండా రైతులకు కరెంటు సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెర్రలు బారుతున్న వరి పంటలు



కింద పడ్డ ట్రాన్స్‌ఫార్మర్

నెర్రలు బారుతున్న వరి పంటలు

భారీ వర్షాల వల్ల వరదలు వరి పంటలలో నుండి పోవడంతో రైతులు భారీగా పంటలు నష్టపోగా మిగిలిన పంటలను కాపాడుకుందాం అని చూస్తే పది రోజులైనా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు లేక వరి పొలాలన్ని నెర్రలు బరాయి. విద్యుత్ సరఫరా లేక బోరు బావులు నడవక పోవడంతో వరి కులాలు ఎండిపోయే స్థితికి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌ను పునరుద్ధరిస్తే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.



సదాశివనగర్ 44వ జాతీయ రహదారిపై లేజర్ గన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ, కలెక్టర్

ప్రజల ప్రాణాలను కాపాడేందుకే లేజర్ గన్స్ ఏర్పాటు

- ప్రారంభించిన ఎస్పీ రాజేష్ చంద్ర

మరిన్ని వివరాలు 6వ పేజీలో...

క్రైం సమాచారం

ప్రజల ప్రాణాలను కాపాడేందుకే వేగ నియంత్రణ ఏర్పాట్లు

» కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

సదాశివనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలను కాపాడటానికే జాతీయరహదారిపై వేగ నియంత్రణ కోసం లేజర్ గన్స్‌ను ఏర్పాటు చేశామని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. సోమవారం సదాశివనగర్ మండల పరిధిలో 44వ జాతీయరహదారిపై జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్‌తో కలిసి లేజర్ గన్స్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంగించిన వారికి స్పీడ్ లేజర్ గన్ ద్వారా చలననాలు విధించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రత చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనలు ఫలితంగా ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2024 ఆగస్టు వరకు జిల్లాలో మొత్తం 188రోడ్డు ప్రమాదాలు జరగగా, 2025 ఆగస్టు వరకు 145 జరిగాయన్నారు. వీటి ద్వారా 22.9శాతం ప్రమాదాల తగ్గుదల నమోదైందన్నారు. మరణాలు 197 నుండి 153కి గాయపడిన వారు 355నుండి 298కితగ్గినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రోడ్డు భద్రతా చర్యల విజయాన్ని సూచిస్తూ ప్రజల ప్రాణ రక్షణలో ఒక గొప్ప ముందడుగా నిలిచిందన్నారు. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీ చేపట్టి నిబంధనలు పాటించని ముఖ్యంగా హెల్మెట్ ధరించని, మద్యం సేవించి వాహనాలు నడపే వారికి జరిమానాలు విధించడంతో పాటుగా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో మూడు స్పీడ్ గన్స్ వాహనదారుల వేగాన్ని నియంత్రించడం కొరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై పుష్పరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


బస్సు కింద పడి ఉన్న బైకు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప గుడి వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అకస్మాత్తుగా ముందర ఉన్న స్కూల్ బస్సు, ఇతర వాహనాలు ఆపడంతో వెనుక బైక్‌పై వస్తున్న సంతోష్ అనే వ్యక్తి స్కూల్ బస్సును ఢీకొన్నాడు. వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు మధ్యలో ఉన్న సంతోష్‌ను ఢీకొట్టడంతో సంతోష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. రక్తం మడుగులో ఉన్న సంతోష్‌ను ట్రాఫిక్ పోలీసులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. చికిత్స పొందుతూ సంతోష్ మృతి చెందాడు. మృతుడు సంతోష్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా టైల్స్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జార్ఖండ్‌లో ప్రమాదవశాత్తు జలపాతంలో యువకుడి మృతి


శ్రీహరి(ఫైల్)

నవీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(బి) తండాకు చెందిన సబావత్ శ్రీహరి(20)అనే యువకుడు జార్ఖండ్ రాష్ట్రంలో ఆదివారం ప్రమాదవశాత్తు వాటర్ ఫాల్‌లో పడి మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. నాలుగు మాసాల క్రితం శ్రీహరికి జార్ఖండ్ రాష్ట్రంలోని పశ్చిమ సింగభూం ఓటదిరి బ్రాంచ్ పోస్టాఫీస్ అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఉద్యోగం రాగా అక్కడే విధులు నిర్వహిస్తున్నాడని అన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సమీపంలోని చక్రధర్ పూర్ వాటర్ ఫాల్‌లో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లగా నీటి ప్రవాహం పెరగడంతో అందులో పడి మృతి చెందాడని గ్రామస్థులు పేర్కొన్నారు. మృతదేహం సోమవారం లభ్యం కాగా అక్కడే పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని అన్నారు. శ్రీహరి మృతదేహం మంగళవారం సాయంత్రానికి స్వగ్రామానికి చేరే అవకాశం ఉందని గ్రామస్థులు వివరించారు. గ్రామానికి చెందిన కైలాస్, ఐలబాయి దంపతులకు శ్రీహరి ఏకైక కుమారుడు కాగా అతనికి ఇద్దరు సోదరిమణులు ఉన్నారు. ప్రమాదవశాత్తు శ్రీహరి మృతి చెందడం పట్ల అబ్బాపూర్(బి) తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

తండ్రిని చంపిన కొడుకుకు జీవితఖైదు


» రూ.10 వేల జరిమానా: ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన కొడుకుకు జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్ జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2021 మార్చి 16న నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన జాన్కం విఠల్‌ను తన కొడుకు సంగమేశ్వర్ దూలానికి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రికరించాడని మృతుని కుమార్తె బోయిని కవిత ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. 2021 మార్చి 15న సంగమేశ్వర్ తన తండ్రి విఠల్‌తో గొడవపడి చెంపపై కొట్టి రేపటి వరకు నీ అంతుచూస్తానని వార్నింగ్ ఇచ్చాడని తెలిపారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు దూలానికి విఠల్ ఉరివేసుకుని చనిపోయినట్లు చిత్రికరించాడని తెలిపారు. ఈ కేసులో సాక్షులను విచారించిన్యాయమూర్తి శిక్షను ఖరారుచేసినట్లు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురికి మూడేళ్ల శిక్ష

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన ముగ్గురికి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టి.శ్రీనివాస్ సోమవారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే కోటగిరి మండల కేంద్రంలోని చవిడి గల్లీ నివాసురాలైన గైని రామవ్వ తన ఇంటికి దగ్గర చెల్లెడిగే సుగుణకు చెందిన స్వంత ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఖాళీ స్థలంలో షెడ్డు వేసు కోవడానికి రామవ్వ సామగ్రి తెచ్చుకుంది. స్థలం విషయంలో అదే కాలనీకి చెందిన పోలీస్ కానిస్టేబుల్ బర్ల ప్రవీణ్ కుమార్, తమ్ముడు బర్ల నవీన్, తన తండ్రి బర్ల భూమయ్యతో కలిసి రామవ్వతో గొడవ పడ్డారు. 28 మార్చి, 2021న ఆమె షెడ్డు కోసం తెచ్చి పెట్టుకున్న రేకులు, కట్టెలు ధ్వంసం చేసి మురికి కాలువలో వేశారు. అడ్డుపడిన ఆమెను అసభ్య పదజాలంతో పాటు కులం పేరుతో దూషించి, అవమాన పరిచి కులం పేరుతో దుషించారు, గైని రామవ్వపై విషయాలపై కోటగిరి పోలీసులకు పిర్యదు చెయాగా పోలిసులు కేసు నమోదు చెసి కోర్టు లో దాఖలు చేయగా కోర్టులో పీపీ వసంత్ వాదించాగా విచారణ అనంతరం జడ్జి కోర్టు షెడ్యూల్డ్ కులంకు చెందినా మహిళను బహిరంగ ప్రదేశంలో బెదిరించి నందుకుగాను కులంపేరుతో దూశించి అవమానించినందుకుగాను మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పాముకాటుతో రైతు మృతి


మొగులయ్య(ఫైల్)

గాంధారి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన గాంధారి మండలంలోని ముదెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వడ్నాల మొగులయ్య(55) అనే రైతు ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించగా నిద్రలో పాము కరించిందని, అది గమనించి కుటుంబసభ్యులకు తెల్పడంతో చికిత్స నిమిత్తం బాన్సువాడకు తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనా చికిత్స కోసం నిజామాబాద్ తరలిస్తుండగా తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

● మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి


క్రీడాజ్యోతిని అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని మాజీ మంత్రి, బాల్కొండ నియోజికవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్ నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన క్రీడాకారుల గౌరవ క్రీడావందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అమీర్‌నగర్‌లో మండల క్రీడోత్సవాలు నిరహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కోనా సముందర్ పీఏసీఎస్ చైర్మన్ సామ బాపురెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, ఎంఈవో ఎస్ ఆంధ్రయ్య, జాతీయక్రీడాకారుడు రవిందర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ క్యాతం గంగారెడ్డి,కార్యదర్శి నగేష్ కన్వీనర్ అమీర్‌గర్ హెచ్ ఎం రాజ్‌కిరణ్, విడిసి సభ్యులు గంగాధర్, పుప్పాల నర్సయ్య, రేగుంట దేవేందర్ గడ్డం స్వామి, ఏనుగు రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు గ్రామస్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, పవన్, గంగాధర్, నగేష్, నాగభూషణం లతదితరులు పాల్గొన్నారు.

మార్చ్‌ఫాస్ట్ విజేతలు వీరే

ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ చౌట్‌పల్లి, ద్వితీయ సంయుక్తంగా బషీరాబాద్, కోనామందర్, ప్రైవేట్ పాఠశాల విభాగంలో ప్రథమ విజ్ఞాన జ్యోతి, ద్వితీయ కృష్ణవేణి, తృతీయ శ్రీ విద్యాసాయి విజేతలుగా నిలువగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎంపీహెచ్ఎస్ అమీర్‌నగర్ దక్కించుకుంది.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు


బోధన్ పట్టణంలో ర్యాలీ దృశ్యం


మిలాద్ ఉన్ నబీ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తున్న యువకులు

బోధన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ, మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మైనారిటీలు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత బస్తీలో గల ప్రఖ్యాతి చెందిన జలాల్ బుకారి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం పట్టణంలోని అన్ని వార్డులలో మైనారిటీ సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ర్యాలీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చెప్పిన మానవత్వం, ప్రేమ, శాంతి, ఏకత్వం వంటి విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ గురువులు, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రుద్రూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం నాయకులు సోమవారం రుద్రూర్ మండల కేంద్రంలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రుద్రూర్ గ్రామంలోని మజీద్‌ల వద్ద నుండి శాంతి ర్యాలీ చేసుకుంటూ బస్టాండ్ ఆవరణలో కొద్దిసేపు ప్రవచనాలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ముస్లిం నాయకులు తెలిపారు. మండలంలోని అక్బర్‌నగర్, సులేమాన్ ఫారంతో పాటు తదితర గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్, నిసార్, జమీల్, మొయిన్, రియాజ్, ఖాదర్, లాల్ మహమ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

బోధన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని బీజేపీ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్ అన్నారు. సోమవారం బోదన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, అట్టలను అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాథమిక పాఠశాల యొక్క కలర్ తొలగిపోవడం వల్ల పెయింటింగ్ వేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూరెళ్ల శ్రీధర్, నెమిళ్ల సాయి, వెంకటేష్, దోనకంటి లక్ష్మారెడ్డి, మనోహర్, జీలకర్ర ప్రవీణ్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై దాడులు


మెడికల్ షాప్ తనిఖీ చేస్తున్న అధికారి

మోస్రా, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చందూర్, మోస్రా మండల కేంద్రాలతో పాటు మండలాల్లోని ప్రైవేట్ ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతకు మించి వైద్యం చేయవద్దని ఇంజక్షన్ ఇవ్వడం, బెడ్లు పెట్టడం, ఇష్ట తీరునా టెస్టులు రాయడం చేయవద్దని ఆర్ఎంపీ, పీఎంపీలు అత్యవసర పరిస్థితుల్లో కేవలం ఫస్ట్ ఎయిడ్ చేసి దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని సూచించారు. బెడ్లు ఉండటం చూసి ఆగ్రహం చేశారు. మెడికల్‌లో మెడిసిన్ అమ్మాలి బేకరీ వస్తువులు కాదని హెచ్చరిక చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనం పట్టివేత


ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

మద్నూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలంలోని మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న బులోరా బండిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం లో ఉంచారు. డోంగ్లి మండలం సిరిపూర్ మంజీరా ప్రాంతం నుంచి ఇసుక లోడ్‌తో తరలిస్తున్న బులోరా వాహనాన్ని తనిఖీ చేయగా ఇసుక లోడుకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

● ఎమ్మెల్యేను కోరిన పడిగెల వీడీసీ సభ్యులు


వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కలిసి కోరిన పడిగెల వీడీసీ సభ్యులు

వేల్పూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని సోమవారం వేల్పూర్‌లో ఆయన నివాసంలో వీడీసీ సభ్యులు కలిసి కోరారు. తమ గ్రామంలో పలు సమస్యలను తాము ఎదుర్కొంటున్నామని ఆ సమస్యల పరిష్కారానికి నిధులు తమద్వారా మంజూరు చేయాలని వీడీసీ సభ్యులు కోరారు. 63వ జాతీయ రహదారి పడిగెల క్రాస్‌రోడ్డు నుంచి బాల్కొండ రోడ్డు వరకు బీటీ రోడ్డు రినివల్ పనులకు, గ్రామం నుంచి శ్రీరాంపూర్ వరకు ఉన్న కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని తమ గ్రామ ఆరాధ్య దైవమైన ఆదిమల్లన్న గుట్ట చుట్టు జాతీయ రథం తిరగడానికి సీసీ రోడ్డు మంజూరుకు, మేడే ఒర్రె దగ్గర లో లేవల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని విడిసి సభ్యులు కోరుతూ వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు టార్పాలిన్ పట్టాలు అందజేత


టార్పాలిన్ పట్టాలు అందజేస్తున్న ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్

రుద్రూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో నిరుపేదల ఇళ్లు వర్షానికి ఉరుస్తుండడంతో ఈ విషయాన్ని బీజేపీ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ బాధిత కుటుంబాలకు టార్పాలిన్ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు బేగరి వినోద్, నాయకులు ఏముల గజేందర్, పార్వతి మురళి, వడ్ల సాయినాథ్, గణేష్, కృష్ణం రాజు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సాయి కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

ఏర్గట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో 51 ఇళ్లు మంజూరీ కాగా 30 ఇళ్ల నిర్మాణల పనులు జరుగుతున్నాయని, 21 ఇళ్లు ప్రారంబిచాల్సి ఉందని తెలిపారు.

పోరాటాలతో సాగు రంగాన్ని పరిరక్షించుకుందాం


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు

ఆర్మూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతును భూమిని వేరుచేసే కుట్ర చేస్తోందని కార్పోరేట్‌లకు సాగుభూములు కట్టబెటేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుని, పోరాటాలతో సాగురంగాన్ని పరిరక్షించుకుందామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. ఆర్మూర్ లో సోమవారం సుంకాలు, వ్యవసాయ రంగం పై ప్రభావం సహకార వ్యవస్థ పునర్జీవం అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పత్తిపంట చేతికి వచ్చే సమయంలో గుజరాత్‌లోని పెద్ద కార్పోరేట్ పత్తి మిల్లుల లాభాల కోసం అమెరికా నుంచి పత్తిదిగుమతికి సుంకాలను మోదీ ప్రభుత్వం ఎత్తివేయడం దారుణమన్నారు. గతంలో 11 శాతం పన్ను విధించగా దానిని పూర్తిగా ఎత్తివేయడంతో అమెరికా పత్తిని మిల్లులు దిగుమతి చేసుకుంటున్నాయని ఇక్కడ పండించిన రైతు పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా తెప్పించేందుకు కేంద్రం ఇండెంట్ సరిపడా పెట్టలేదని దీంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. ప్రజలకు అన్నం పెట్టే రైతును వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముూడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, కొండ గంగాధర్, పిడమర్తి సాయిలు, కుతాడి ఎల్లయ్య, నాగరాజు, బద్దం నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి


ఏర్గట్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఏర్గట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు బాధిత కుటుంబాలను సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన రొక్కెడ లింబరాజుల భార్య ఇటీవలే మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, మెరుగు గణపతి తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎనగుందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసి జక్కని మధుసుధన్, సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పల్లి సికింద్రాపూర్ గ్రామంలో సోమవారం పలువురు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పరామర్శించారు. సికింద్రాపూర్‌లో మాజీ ఎంపీపీ కుంచాల విమల రాజు తల్లి మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పరామర్శించారు. జక్రాన్‌పల్లిలో నట్ట నికిల్ గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, చింత మహేష్, అరుణ్, డికొండ శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, వెంకట్, అక్బర్‌కాన్‌లు ఉన్నారు.

ప్రతీ పాఠశాలలో మొక్కలు నాటాలి

● ఎంఈవో స్వామి

భీమ్‌గల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో మొక్కలను నాటాలని ఎంఈవో స్వామి తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్వచ్ఛ విద్యాలయ హరిత విద్యాలయపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంరద్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో ప్రతీ విద్యార్థికి హరితహారం, పర్యావరణ పరిరక్షణపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రతీ పాఠశాలలో మొక్కలను పెంచి సంరక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్గట్ల కేజీబీవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు


ఏర్గట్ల కేజీబీవిలో వైద్య పరిక్షలు చేస్తున్న డాక్టర్ రక్షిత

ఏర్గట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ రక్షిత రెడ్డి సోమవారం కేజీబీవి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులక రక్తహీనత పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య బోధన వ్యక్తిగత శుభ్రత, దోమలు కట్టుకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో సంధ్య, హెల్త్ అసిస్టెంట్ పండరి, కల్పన, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

శీతాకాల శిబిరం ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో

మాక్లూర్, సెప్టెంబరు, 8 (ఆంధ్రజ్యోతి): ఉమెన్స్ కళాశాల కంఠేశ్వర్ వారి ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగం గా సోమవారం ఏడు రోజుల పాటు జరిగే శీతాకాల శిబిరాన్ని ముత్యంపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ భారతిరెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటరీలు పాల్గొన్నారు.


కలిగోట్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ


అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 8 (ఆంధ్రజ్యోతి): పనుల జాతర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 12 లక్షలతో ఈ అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోజన్న, పంచాయితీ పీఆర్ఏఈ సురేందర్, తదితరులు పాల్గొన్నారు

బోదపల్లిలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు

ముప్కాల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని బోదపల్లిలో సోమవారం గొర్రెలు, మేకలకు ఉచిత పీపీఆర్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి ప్రారంభించారు. జీవాల పెంపకం దారులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 850 గొర్రెలకు, 140 మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి గౌతమ్‌రాజు, ప్రవీణ్, ప్రణీత్, మల్లేష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు మూసివేసిన దృశ్యం

నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల మూసివేత

- ఎగువ నుంచి స్వల్పంగా వరద నీరు రాక
- ప్రధాన కాలువ ద్వారా పంటలకు

1500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగింపు

నిజాంసాగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 20 రోజులుగా నిరాటకంగా కొనసాగిన వరద గేట్లను నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం మూసివేశారు. ఆగస్టు 18 నుంచి నిజాంసాగర్‌లోనికి భారీ వరద నీరు రావడంతో క్రమేపిన వరద గేట్లుమంజీరా దిగువకు వరద నీటిని వదిలేశారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అధికారులు గేట్లను మూసివేసి పూర్తి నీటి సామర్థ్యాన్ని నిలువ చేస్తున్నారు.నిజాంసాగర్‌లోనికి ఎగువ ప్రాంతం నుంచి 20376 క్యూసెక్కుల వరద నీరు వస్తూనే ఉంది. నిజాంసాగర్ పూర్తి నీటి మట్టం నిలువ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన కాలువ వెంట ఆయకట్టుకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగుల నీటి మట్టానికి గాను 1404.65 అడుగుల నీటి మట్టాన్ని నిలువ చేస్తున్నారు. 20 రోజుల పాటు నిరాటకంగా కొనసాగిన వరద గేట్ల ఎత్తివేత మూసివేయడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా తొణికిసలాడుతోంది.

జాతీయ క్రీడా పోటీల్లో
విజేతలకు సన్మానం



పతకాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న డీఈవో

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పథకాలు సాధించిన మండలంలోని తొర్లికొండ పాఠశాల విద్యార్థులను డీఈవో అశోక్ సన్మానించారు. తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మం ది విద్యార్థులను డీఈఓ అశోక్, జిల్లా గేమ్స్ కార్యదర్శి నాగమణి, డీసీఈబీ సెక్రటరీ సీతయ్య, సాంఘీక సంక్షేమ విద్యాసంస్థల జిల్లా స్పోర్ట్ కోఆర్డినేటర్ నిరంజన్‌రెడ్డి కలిసి విద్యార్థులను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. క్రీడా పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగమోహన్, వీడీసీ సభ్యులు అభినందించారు.

సోషల్ మీడియాలో అభ్యంతకరమైన
పోస్టు చేసిన యువకుడిపై కేసు

నవీపేట,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రవి అనే యువకుడు తన సోషల్ మీడియా స్టేటస్‌లో మార్ఫింగ్ చేసి అభ్యంతకరమైన పోస్టును పెట్టగా అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. సంబంధిత యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలను, అసత్య ప్రచారాలను నమ్మకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ పేర్కొన్నారు.

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకిసేవ



పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయం, రామాలయం, అయ్యప్ప, దుర్గమాత, దత్తాత్రేయ, ఏకశిల స్తంబం వద్ద గల హన్మాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భజన మండలి సభ్యులు, భక్తులు భక్తీ గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్ గౌడ్, బట్టు శంకర్, అలిశెట్టి నరేష్, కొంతం మురళి, సిద్దుల గుట్ట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రేషన్.. సంబురం!

- ఉమ్మడి మండలంలో కొత్తగా 1802 రేషన్ కార్డులు
- ప్రతీ నెల అదనంగా 332.64 క్వింటాళ్ల బియ్యం

కోటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో గ్రామాల్లో సన్న బియ్యం సంబురం కనిపిస్తోంది. కోటగిరి, పోతంగల్ మండలాల్లో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా రేషన్ కార్డుల కోసం కోటగిరి మండలంలో 1092మంది, పోతంగల్ మండలంలో 945మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం కోటగిరి మండలంలో 956 కార్డులు మంజూరు కాగా కొత్తగా 2957మంది సభ్యులు నమోదయ్యారు. పోతంగల్ మండలంలో 846కార్డులు మంజూరు కాగా 2588 మంది సభ్యులు నమోదు అయ్యారు. కోటగిరి మండలంలో 85 దరఖాస్తులు రిజక్ట్ కాగా పోతంగల్ మండలంలో నాలుగు రిజెక్ట్ అయ్యాయి.

కొత్తగా మంజూరైన, పేర్లు నమోదు అయిన కార్డు లబ్దిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 332.64 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లబ్దిదారులకు అందించారు. కొత్త కార్డుల లబ్ధిదారులతో రేషన్ దుకాణాలు సందడిగా మారాయి. రేషన్ కార్డులపై ఆశలు వదులుకున్న తరుణంగా ప్రజలకు ప్రభుత్వం భరోసా నింపడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అర్హులైన లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయడంతో హర్షం వ్యక్తమవుతుంది.



కోటగిరి రేషన్ షాప్‌లో బియ్యం తూకం వేస్తున్న దృశ్యం

● **సన్నబియ్యం తీసుకుంటున్నాం..**

అరుణ, కోటగిరి



ఏడేళ్ల క్రితం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టు తిరిగి అలసిపోయ్యాం. రేషన్ కార్డులో పేరు పాప పేరు నమోదు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేరు నమోదు చేసి రేషన్ కార్డు ఇవ్వడంతో మా కుటుంబానికి ప్రతీ నెల 24 కిలోల చొప్పున సన్నబియ్యం వస్తున్నాయి.

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎడపల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాల్‌లో సోమవారం బోధన్ పట్టణ ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులు, లెక్చరర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణం విద్యారంగానికే తలమానికంగా నిలిచిందని అభివర్ణించారు. బోధన్ ప్రాంతంలో చదువుకున్న విద్యార్థులు ఎందరో సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో స్థిరపడి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించడంతో పాటు నైతిక విలువలను బోధించాలని సూచించారు. ప్రస్తుతం విద్యారంగంలో గంజాయి, మాదక ద్రవ్యాలు వంటి ఘటనలు అనునిత్యం దర్శనమివ్వడం ఆందోళనకరంగా మారిందన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం 22 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు కొడాలి కిషోర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, లయన్స్ క్లబ్ ప్రతినిధి బసవేశ్వర్ రావు, ఏసీపీ శ్రీనివాస్, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు సూర్య ప్రకాష్, శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, కృష్ణ మోహన్, హరికృష న్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా



ప్రజావాణికి హాజరైన అధికారులు

తాడ్వాయి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజావాణికి వచ్చే ప్రతీ ఒక్క దరఖాస్తును తక్షణమే పరిష్కరించాలని అధికారులకు పదే పదే చెబుతున్నా ప్రతి సోమవారం తాడ్వాయి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి నాలుగు ఐదు శాఖల మినహ ఎవరు హాజరు కావడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు చెపుతున్న అధికారులు మాత్రం ప్రజావాణికి రావడం లేదు. ప్రతి సోమవారం 4, 5 శాఖల మినహా ఎవరు హాజరు కావడం లేదు. సోమవారం జరిగిన ప్రజావాణిలో తహసీల్దార్ మండల పంచాయతీ అధికారి ఆర్డబ్ల్యూఈఎస్ హెల్త్ శాఖలు మినహా వేరే శాఖలు హాజరు కావడం లేదు. ఒక వేళ ప్రజావాణిలో దరఖాస్తులు వస్తే హాజరు కాని శాఖలు ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి రాని అధికారులకు సంబంధిత అధికారులు మెమోలు జారీ చేస్తారా లేదా వేచి చూడాలి.

స్వచ్ఛ్ హరిత విద్యాలయంపై హెచ్‌ఎంలకు శిక్షణ



ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్వచ్, హరిత విద్యాలయ రేటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, చెట్లు నాటడం, కిచెన్ గార్డెన్, నీటి సంరక్షణ, నీటి పరీక్షలు, భూసార పరీక్షలు, హ్యాడ్ వాష్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు పద్మ, శంకర్, రాజేశ్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

రెంజల్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్ అన్నారు. సోమవా రం తహసీల్దార్ శ్రావణ్ కు మార్కు వినతిపత్రాన్ని అందజేశారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు వరిపంటకు 50వేలు, సోయాకు రూ.70వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు బ్యాంకు నుంచి రుణాలు తీసుకుటప్పుడు బ్యాంకర్లు రైతు బీమా చేయాలని వెంటనే బీమా సౌకర్యాన్ని కల్పించి వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. మోడీ రైతు వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నాడని పేర్కొన్నారు. దేశంలో రైతులు ఆత్మహత్య చేసుకున్న వారిలో పత్తి రైతులే అధికంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో పత్తి రైతులు నష్టపోతున్నా న్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని లేనియెడల ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నసీర్, ఒడ్డెన్న, సిద్ద పోశెట్టి, పెద్దులు, జబ్బర్, మన్నె పోశెట్టి, తరుణ్, సాయిలు, లక్ష్మణ్, సుదర్శన్ గౌడ్, శివాజీ, మక్కన్న, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



నవీపేటలో పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నవీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల వస్తువులపై జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, మైస రాధ, శ్రీకాంత్, నీరడి భూషణ్, గణేష్, రాము, రాజశేఖర్, గంగాధర్, సందీప్, భాను కులకర్ణి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవీపేట,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను సోమవారం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కవిత స్వగృహానికి వారు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు అండగా ఉంటామని పేర్కొంటూ తమ సంఘీబావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ కవిత మామ రాంకిషన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ రావుతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు రెంజల్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

ఓటరు లిస్టులో తప్పులను సరి చేయాలి

● కోటగిరిలో పోచారం తనయుడి ఓటు తొలగించాలి



కోటగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా తప్పుల తడకగా మారిందని బీజేపీ మండల అధ్యక్షుడు యేముల నవీన్ విమర్శించారు. కోటగిరి మండల కేంద్రంలో ఓటరు లిస్ట్‌లో తప్పులను సరి చేయాలని తహసీల్దార్ గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటగిరి గ్రామంలో మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తనయుడు పోచారం సురేందర్ రెడ్డి ఓటు 1-62 ఇంటి నెంబర్‌లో ఏపిక్ నెంబర్ ఆర్ఎస్‌బీ 15,21,863తో నమోదు చేశామన్నారు. పోచారం సురేందర్ రెడ్డి కోటగిరి గ్రామ నివాసి కాకపోయిన ఓటు ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఆయన ఓటును తొలగించాలని డిమాండ్ చేశారు. కోటగిరి గ్రామానికి చెందిన ఓ పురుషుడికి ట్రాన్స్‌జెండర్ ఓటరులో లిస్ట్‌లో చూపించడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో చాలా మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించలేదన్నారు. కొంతమందికి డబుల్ ఓట్లు వచ్చాయన్నారు. ఓటరు లిస్ట్ తప్పుల తడకగా మారిందని తక్షణమే సరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హొగిర్‌రావు దేశాయ్, మామిడి శ్రీనివాస్, వడ్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ముట్టడి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భీమ్‌గల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పండ్లు, కూరగాయల మార్కెట్ ను పాత తహసీల్దార్ ఆఫీస్‌కు తరలించాలని మున్సిపల్ కార్యాలయాన్ని, పట్టణ కేంద్రానికి మంజూరైన పోస్ట్ ఆఫీస్‌కు మ్యుటేషన్ ఇప్పించాలని తహసీల్దార్ కార్యాలయాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మధు మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో కూరగాయలు పండ్ల వ్యాపారస్తులు ఎక్కడపడితే అక్కడ పెట్టడంతో ప్రజలు, ప్రయాణికులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారని కనుక దీనిని వెంటనే పాత ఎమ్మార్వో ఆఫీస్‌కు తరలించాలని కోరారు. అలాగే ఎంపీ ధర్మపురి అరవింద్ నిధులతో మంజూరైన పోస్ట్‌ఆఫీస్ భవన పనులకు జాప్యం జరుగుతుందని కనుక వెంటనే తహసీల్దార్ కార్యాలయం నుంచి కావాల్సిన ముటేషన్‌ను ఇప్పించి పనులను త్వరితగతంగా ప్రా రంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర్, నర్సయ్య, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, సీనియర్ నాయకులు సంధ్యరాజు, పతని ప్రవీణ్, రైతు అధ్యక్షుడు నీలం గంగాధర్, యువమోర్చ అధ్యక్షుడు రాగి అజయ్, బూత్ అధ్యక్షుడు శక్తి కేంద్ర ఇన్‌చార్జి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో సోమవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వైద్యులు గర్భిణులకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ పాప, ఎంఎల్‌హెచ్‌పీ తిరుమలేశ్, ఆరోగ్య కార్యకర్తలు దుర్గామణి, సావిత్రి , ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఆర్మూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం



జక్రాన్‌పల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో శ్రీనివాస్



ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సురేష్‌కుమార్

ఆర్మూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంమందిర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సిరిల్ రావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఘ నంగా సన్మానించారు.

జక్రాన్‌పల్లి: గురు పూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా సురేష్‌కుమార్ ఎంపిక

డొంకేశ్వర్: డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ప్రధానో ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా సురేష్ కుమార్‌ను శాలువాతో ఘనంగా ఉపాధ్యాయులు విద్యార్థులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వేల్పూర్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 15 ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో రేణుక సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య బోధనలో ఉత్తమ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కోమన్‌పల్లిలో..

ఆర్మూర్: కోమన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడీసీ సభ్యులు, యూత్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గ నిర్ధేశకులన్నారు.

బోధన్: పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ జీఎం పోలవరపు బసవేశ్వర్ రావు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెల కట్టలేనిదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే ఉంటుంది కావున సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలని, విద్యార్థులను సక్రమమైన మార్గంలో పెట్టడం కొంచెం కష్టమైన తల్లిదండ్రులతో కోఆర్డినేట్ చేసుకుంటూ వారిని మంచి దారిలో పెట్టే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్, బోధన్ విద్యాశాఖ అధికారి నాగయ్య, జోన్ చైర్మన్ కె.రామకృష్ణ, లయన్స్ ప్రతినిధులు సుబ్బారావు, శ్రీనివాస్ రాజు, సత్యనారాయణ, వెంకటేశ్వర్ రావు, బలరాం రెడ్డి, రాజశేఖర్, లక్ష్మణ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కోమన్‌పల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు



బోధన్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

గురువులు సన్మార్గ జీవితానికి పునాదులు వేస్తారు



ఎల్లారెడ్డిలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న ఆర్డీవో

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు జన్మనిచ్చి నడకనేర్పితే గురువులు సన్మార్గ జీవితానికి పునాదులు వేస్తారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులేని విద్య గుడ్డిదని, స్థానం ఏదైన అందరికి మార్గదర్శకులు గురువులని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తయారుచేసేది ఉపాధ్యాయులని అందుకే గురువుకు సమాజంలో అత్యుత్తమ స్థానం కలిగిందని అన్నారు.విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులేనని, మేము కూడా ఒకనాడు విద్యార్థులమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి,డీఈవో రాజు, గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి, ఆర్‌డీఓ వీణ, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండలంలోని ఎల్లారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న షేక్‌అహ్మద్‌ను సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌లు సన్మానించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి,ఎస్‌జీటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు, ప్రధానకార్యదర్శి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చిన్నస్వామిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక చేశారు. 16 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విధులకు అర్థమయ్యే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివిధ ప్రయోగాలు టీఎల్ఎం సైన్స్ టెక్నాలజీలను ఉపయోగించి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుడని ఆయనను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యా కమిటీ చైర్మెన్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



నసురుల్లాబాద్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సదాశివనగర్: మండలంలోని కల్వరాల్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు శైలజ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఈవో రాజు, ఎంఈవో యోసెఫ్, కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా సుజాత, శైలజను అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహితలు మాట్లాడుతూ అంకితబావం, విద్యార్థుల పట్ల చూపిన ప్రతిభతోనే ఈ అవార్డులు సాధించినట్లు తెలిపారు. మున్ముందు విద్యార్థులకు మరిన్ని సేవలందిస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏంఈవో విజయ్ కుమార్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పాత్ర చాల గొప్పదని అన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలపే శక్తి ఉపాధ్యాయులదే అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, శరత్ కుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆర్డీఓ పార్థసింహారెడ్డి, ఎంఈఓ లింగాపురం రాజులు శాలువలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మండలం నుంచి సురేష్ గౌడ్ స్కూల్ అసిస్టెంట్ మత్తమాల, ఏం. రాధిక స్కూల్ అసిస్టెంట్ జెడ్పిహెచ్ఎ్‌స గండిమాసానిపేట్, కె. సంధ్య, ఎస్‌జిటి ఎంపీపీఎస్ కళ్యాణి, గులాం షాకీర్, ఎస్జిటి ఎంపిపిఎస్ మీసంపల్లి, సవాయి సింగ్, ఎస్జిటి ఎంపిపిఎస్ కొత్తపల్లి, శివకుమార్ ఎస్జిటి ఎంపీపీఎస్ సోమార్పేట్, విజయ్ కుమార్, ఎస్‌జిటి జెడ్పిహెచ్ఎస్ అడవిలింగల్, వినయ్ కుమార్ ఎస్జీటీ ఎంపీపీఎస్ మాచాపూర్, గాంధీ పి జి టి ఆదర్శ పాఠశాల ఎల్లారెడ్డి, స్రవంతి సిఆర్‌టి కేజీబీవీ ఎల్లారెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా వీరిని ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఇటీవల రిటైర్‌మెంట్ అయినటు వంటి ఉపాధ్యాయులను సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు శాఖ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీనివాస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని విద్యాశాఖ, పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని జరుపుకుని ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి ఈశ్వర్‌గౌడ్, ఎంఈవో చందర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి శ్రీచంద్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శెట్లూర్ శివారులో ఇసుక డంప్ నుంచి జేసీబీతో భారీ వాహనాల్లో లోడ్ చేస్తున్న దృశ్య



టిప్పర్‌లో ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలిస్తూ..

దర్జాగా.. దందా

(5వ పేజీ తరువాయి...)

ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఆ ప్రొసీడింగ్‌ల ఆధారంగా పుల్కల్‌లో కాకుండా శెట్లూర్ మంజీరలో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. శెట్లూర్ మంజీరలో ట్రాక్టర్‌ల ద్వారా కూలీలను పెట్టి ఇసుక తవ్వకాలు జరిపి అక్కడి నుంచి ఓ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన ప్రాంతం నుంచి జేసీబీ ద్వారా టిప్పర్‌లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాంట్రాక్టర్ కర్ణాటకకు చెందిన వారు కావడంతో ఓవర్‌లోడ్‌తో టిప్పర్‌లలో ఇసుకను గుట్టుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం 10 టిప్పర్‌లలో ఇసుకను తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ స్థానికంగా ఉండే ట్రాక్టర్ యజమానులకు ఒక్కో ట్రిప్పుకు రూ.1600, గ్రామానికి టిప్పర్‌కు రూ.1300 చొప్పున చెల్లిస్తూ.. గుట్టుగా ఇసుక దందాకు తెరలేపాడు.

ఓ మంత్రి పేరు చెప్పి దందా

కర్ణాటకు చెందిన కాంట్రాక్టర్ ఓ మంత్రి పేరుచెప్పి ఇసుక దందాకు జిల్లాలో తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నాగమడుగు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇసుక ను తరలించేందుకు సదరు కాంట్రాక్టర్ పుల్కల్ అనుమతి తీసుకున్నాడు. కానీ అక్కడ తవ్వకాలు జరపకుండా ఓ మంత్రి పేరు చెప్పి గుట్టుగా శెట్లూర్‌లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. శెట్లూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్న సదరు కాంట్రాక్టర్‌ను ఎవరైనా అధికారులు ప్రశ్నిస్తే ఓ మంత్రి పేరు చెబుతున్నట్లు తెలిసింది. సదరు మంత్రితో పాటు జిల్లాలోని ఓ ముఖ్య నేతకు చెందిన వారు గత ఏడాది కిందట మంజీరలో ఇసుక కాంట్రాక్ట్ తీసుకున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధి ఫిర్యాదు మేరకు ఇసుక క్వారీలను నిలిపివేశారు. మరోసారి ఓ మంత్రి పేరిట కాంట్రాక్టర్ ఇసుక దందా చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.



కామారెడ్డిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రధానిమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలభిషేకం చేశారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ మాట్లాడుతూ నిత్యవసర సరుకులు, ఆహారపదార్థాలపై 18శాతం, 12 శాతం ఉన్న పన్నును 5శాతం, 0శాతానికి భారీగా పన్నురేట్లు తగ్గించి సాధారణ ప్రజలపై పన్నుభారాన్ని పడకుండా చూశారని తెలిపారు. ఇన్సూరెన్స్‌కి జీఎస్‌టీని ఎత్తివేయడం ద్వారా అందరికి బీమాసౌకర్యం అందుబాటులోకి వచ్చేలా చూశారని తెలిపారు. అనేక ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా జీఎస్‌టీ తగ్గించడం వల్ల తక్కువ ధరల్లో ప్రజలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిల్ మెంబర్ విపుల్‌జైన్, అసెంబ్లీ కన్వీనర్ కుంటాలక్ష్మారెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, రాజుపాటిల్, రఘు, భూమేష్,శ్రీకాంత్, శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడిగా సాయిలు

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ సహకార సంఘం కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడిగా సాయిలు నియమితులైనట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సాయిలును మత్స్యశాఖ అధికారులు శాలువాతో సన్మానించారు. అనంతరం సంఘ సభ్యులు, తదితరులు అభినందనలు తెలిపారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికుంట గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో వెలిసిన శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి, రామారెడ్డి మండల కేంద్రంలో పార్వతీరాజేశ్వర స్వామి ఆలయంలో, పోసానిపేట్ రాజరాజేశ్వర స్వామి, గొల్లపల్లి గ్రామంలో రాజేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు గర్భగుడిలో పాలాభిషేకం, సిందూర, ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా ప్రసాదాలను పంచారు అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల పురోహితులు జంగం ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, దిలీప్ స్వామి, ఆలయాల చైర్మన్‌లు లచ్చిరెడ్డి, మహిపాల్ రెడ్డి, రెడ్డి మల్లేష్, ధర్మకర్తలు, రాజకీయ నాయకులు, వైద్యులు, మహిళలు, వ్యాపారులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : సీఈవో

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో జల జీవన్ ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 50శాతం సబ్సీడీపై కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జలజీవన్ ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ ఆర్గనైజేషన్ సీఈవో రవికుమార్, జిల్లా కోఆర్డినేటర్ అంజమ్మ మాట్లాడుతూ ఈ శిక్షణలో బాగంగా మహిళలకు అన్నిరకాల కుట్టు, అల్లికల శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందడానికి వీలులేని మహిళలకు జల జీవన సంస్థ జీవనోపాధి కల్పించడానికి ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారని ఆసక్తి గత వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన మహిళలు మహిళా సాధికారత పొందే విధానంలో ప్రతి మహిళా ముందుండి ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మరి భాస్కర్, పటేల్ సాయిలు, భాగ్యలక్ష్మీ, సాయిలు, కారోబార్ కృష్ణమూర్తి, పోచవ్వ, హేమలత, కవిత, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి యోగచాంపియన్ షిప్‌లో ఛాంయిన్‌ట్రోఫీని జిల్లాకు చెందిన విద్యార్థులు సాధించారని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో జోష్ణ గోల్డ్‌మెడల్, నికిత సిల్వర్‌మెడల్, కవిత సిల్వర్‌మెడల్, సింధుజ గోల్డ్‌మెడల్, విగ్నేశ్వరి గోల్డ్ మెడల్,సిరిశా సిల్వర్‌మెడల్, అంజలి ఐదోవస్థానం, విష్ణుప్రియ బ్రాంజ్,సహస్ర ప్రథమ, సహస్ర గోల్డ్ తదితరులు మెడల్స్ సాధించారని తెలిపారు. మొత్తం 12 గోల్డ్, 3 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ జిల్లాకు వచ్చినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ పోటీలలో రఘుకుమార్, అనిల్‌రెడ్డి, లక్ష్మీరాజం,గోమతి, వీణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న యోగ అసోసియేషన్ అధ్యక్షుడు

మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మైనార్టీల ర్యాలీ

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా బాన్సువాడ పట్టణంలో సోమవారం మైనార్టీలు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక మజీద్ నుంచి ప్రధాన రహదారి గుండా సాగుతూ నేకేబీ దర్గా వరకు కొనసాగింది. అనంతరం నేకేబీ దర్గా దగ్గర ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ వహబ్, ఏజాస్, ఆరీఫ్, హకీం, తదితరులున్నారు.

లింగంపేట్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా లింగంపేట్ మండలకేంద్రంలో ముస్లీం సోదరులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ప్రధాన వీధుల గుండా జామా మజీద్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జామా మజీద్‌లో ఈ సందర్భంగా విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జామా మజీద్ సదర్ ఫారుఖ్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మాజీ ఫతియుద్దీన్, మన్సూర్‌ఖాన్, సిరాజ్, ఆరీఫ్, అబ్దుల్ కాలేక్, ముస్తాఫా, మీరాజ్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీలు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్



ఎన్నికల ప్రక్రియలో సహకరించాలి

(5వ పేజీ తరువాయి...)

అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 334 రిలిఫ్ కిట్స్ అందజేత

ఇటివల వచ్చిన వరదలకు ఇబ్బందులకు గురైన బాధితులకు ఇన్ఫోసిస్, రామకృష్ణమట్ సహకారంతో 334 రిలిఫ్‌కిట్స్‌ను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ చేతుల మీదుగా అందించారు. రిలిఫ్‌కిట్‌లో బియ్యం,పప్పు,నూనె,సబ్బులు, పప్పులు,ఉప్పు,పసుపు తదితర నిత్యవసర సరుకులు,బ్లాంకెట్,దుప్పట్లు రిలిఫ్‌కిట్‌లో ఉన్నాయని తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డి వరద బాధితులకు 150 కిట్లను, బాన్సువాడలో 150 కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఆపద సమయంలో వచ్చి వరద బాదితులను ఆదుకుంటున్నందుకు రామకృష్ణమట్, ఇన్ఫోసిస్‌సంస్థకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ వీణ, తహసీల్దార్ జానార్ధన్, రామకృష్ణమట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం నాయకులతో అధికారుల సమావేశం

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అఖిలపక్షం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనితారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగంగా నూతనంగా ఏర్పడిన మండలానికి ఒక జడ్పీటీసీ, ఐదు ఎంపీటీసీలు ఉన్నాయన్నారు. మహమ్మద్‌నగర్, నర్వ, హసన్‌పల్లి కలిపి ఒక ఎంపీటీసీ, గున్కుల్, బూర్గుల్, తూంకీపల్లి ఒక ఎంపీటీసీగా, కోమలంచ మూడవ ఎంపీటీసీగా, దూప్‌సింగ్ తాండా, గాలిపూర్, ముగ్ధంపూర్, గిర్ని తాండా నాల్గవ ఎంపీటీసీగా, సింగీతం ఐదవ ఎంపీటీసీగా ప్రతిపాదనలు వచ్చాయని, దినికి అభ్యంతరాలుంటే తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మహమ్మద్‌నగర్‌లో అఖిలపక్షం సమావేశం నిర్వహిస్తున్న అధికారులు



దోమకొండలోని మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

దోమకొండ: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు లిస్ట్, ముసాయిదా పోలింగ్ స్టేషన్‌ల జాబితాలపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ముసాయిదా జాబితాలను ఈ నెల 6న మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుతో పాటుగా మండలంలోని అన్ని జీపీల నోటీస్ బోర్డులపై అందుబాటులో ఉంచడం జరిగిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ జాబితాలపై ఎటువంటి అభ్యంతరాలు రాలేవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సభ సక్సెస్‌పై.. కాంగ్రెస్ ఫోకస్

(5వ పేజీ తరువాయి...)

విజయవంతం చేసేందుకు ఏరాట్లను రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా పర్యవేక్షించనున్నారు. ఇందుకై ఇన్‌చార్జి కామారెడ్డిలోనె మూడు రోజుల పాటు ఉండనున్నారు. ఈనెల 13న మీనాక్షి నటరాజన్ కామారెడ్డికి వచ్చి బహిరంగ సభ అనంతరం వెళ్తారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే కామారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాలైన జీఆర్, కౌండిన్య, హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇన్చార్జ్ పర్యటించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకోనున్నారు. వరద ప్రాంతాల్లోని ఇంటింటా వెళ్లి బాధితులను ఆమె పరమశిస్తారని తెలిసింది.



టీపీసీసీ అధ్యక్షుడితో చంద్రశేఖర్‌రెడ్డి

టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి విస్తృత స్థాయి కార్యవర్గసమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ సంస్థ గత నిర్మాణంపై, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఈనెల 15 న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగసభ విజయవంతంపై చర్చ, ఓట్‌చోరి, గద్దిచౌడ్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడం తదితర అంశాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చర్చించినట్లు తెలిపారు.

బాన్సువాడ టౌన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ , పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తదితరులున్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా విద్యా శాఖ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులచే గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందని ఎంఈఓ ఎల్. రాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందని అన్నారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ ఈ కార్యక్రమం ద్వారా వయోజన అక్షరాస్యతను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయ బృందం సాయిలు, వెంకటరమణ, మురళి, ఆనంద్, సంజీవులు, రాధిక, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం రేణుక, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ హైస్కూల్ మల్లూరు పాఠశాల విద్యార్థి విద్యార్థులు గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో జడ్పీహెచ్ఎస్ ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలి'

నిజాంసాగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థును తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశం అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి పాఠశాలను ఆయన సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ ఎల్ఐపిలో భాగంగా తరగతి గదిలో పరిశీలించారు. విద్యాబోధనలో విద్యార్థుల విద్యార్థినిల బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి గల సూచనలు, సలహాలను అందజేశారు. ప్రతినెల కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాల నీటిని తనిఖీ చేసి పాఠశాలలో బోధించే అంశాలపై ఉపాధ్యాయులకు తగు సూచనలు అందజేశారు.

'బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తెస్తాం'

బీర్కూర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో శ్రమించి బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జుబేర్ అన్నారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీ ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో శ్రమించి పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఎలమంచిలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని ఓడిస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని విమర్శించారు. ఎమ్మెల్యే పోచారం తన పట్ల కక్ష పూరితంగా వ్యవహరించారని, తనను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరింప చేశారని ఎలమంచిలి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థులను నిలబెట్టి భారీ మెజారిటీ తో గెలిపించుకుంటామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వల్లే బీర్కూర్ మంజీరా నదిపై వారధి నిర్మాణం పూర్తి అయ్యిందని, తెలంగాణ తిరుమల దేవస్థానం మహా పుణ్య క్షేత్రంగా అభివృద్ధి చెందిందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీఒక్కరూ కష్టపడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జుబేర్, ఎలమంచిలి శ్రీనివాస్, నార్ల రత్న కుమార్, అంజిరెడ్డి, రాములు, శివ, బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

దోమకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్సై స్రవంతి అన్నారు. సోమవారం ఆమె దోమకొండ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆయా గ్రామల ప్రజలు సహకరించాలన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు.. రైతుల ఇక్కట్లు

సదాశివనగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వరాల్ పెద్ద చెరువు అలుగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగడంతో రైతులు పొలాలకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. పలువురు రైతులు పొలాలకు వెళ్లడానికి వేసుకున్న రోడ్డు కోతకు గురి కావడంతో పొలాలకు వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. దీంతో రైతులు పంటపొలాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనాతో పాటు రైతులు ఏర్పాటు చేసుకున్న రోడ్డు నష్టం అంచనా వేసి నిధులు విడుదల చేసి రోడ్డును బాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని వారు ఈ సందర్భంగా కోరుతున్నారు.



ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రామారెడ్డి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో రేషన్ డీలర్ పడిగెల దత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని జిల్లా రేషన్ డీలర్ల యూనియన్ ఆధ్వర్యంలో పరామర్శించారు. రేషన్ డీలర్ మృతుడి తండ్రి పడిగెల రత్నాకర్ గుప్తా, మృతుడి భార్య లక్ష్మికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యకమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగం సురేందర్ , ప్రధాన కార్యదర్శి సంతోష్ రావు, కోశాధికారి అన్నం ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, నయీం, రామారెడ్డి మండల అధ్యక్షులు ల్యాగల నాగరాజు, కార్యదర్శి గోపాల్ రెడ్డి, వివిధ గ్రామాల రేషన్ డీలర్ల శ్రీను, వెంకట్ రెడ్డి, రాజు, శంకర్, రెడ్డిపేట్ నాగరాజు, ఇస్మాయిల్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- గాటి
ప్రియ 35- మదరాసి
దర్శన్- బాగి - 4

బాన్సువాడ

మహేశ్వరి	ఘాటీ
వెంకటేశ్వర	మదరాసి

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.160
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230